# గన్నేరువరంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

**నాయకులు పాకాల పరుశురాం**

**ప్రజానావ, గన్నేరువరం:** గన్నేరువరం మండల కేంద్రంలో మాజీ మాజీ ఎంపీ బోయిని పల్లి వినోద్ రావు గన్నేరువరంలో గ్రంథాలయం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి మర్చిపోయారు. ఇప్పుడైనా గన్నేరువరం మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు పాకాల పరశురాం ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు యువకులు పెడదారి పట్టకుండా విజ్ఞానం వినోదం అందించే గ్రంథాలయం ఏర్పాటు చేయాలని నాయకులు పాకాల పరశురాం ప్రభుత్వాన్ని కోరారు 17 గ్రామాలకు మండల మండల కేంద్రానికి వివిధ పనుల మీద వచ్చేవారికి కాలక్షేపం కొరకు ఈ గ్రంథాలయం ఎంతో తోడ్పాటు అవుతుందని పాకాల పరశురాం ప్రభుత్వాన్ని కోరారు

# ఉప సర్పంచ్ సంతోష్‌కు ఎస్సై అభినందనలు



**ప్రజానావ, గన్నేరువరం:** గన్నేరువరం మండలంలోని చాకలివాని పల్లె గ్రామ నూతన ఉపసర్పంచ్‌గా ఎన్నికైన కూన సంతోష్‌ను వేములవాడ ఎస్సై బుర్ర ఎల్లయ్య గౌడ్ ఘనంగా సత్కరించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సై ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సంతోష్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని, గ్రామ అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బుర్ర మల్లేశం గౌడ్, దురముట్ల కిట్టు, జీల మధు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తిని ఎస్సై గౌరవించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# నారాయణపేటలో రంజాన్ వేడుకలు

**ముస్లిం సోదరులకు కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు**



**ప్రజానావ, మరికల్:** నారాయణపేట జిల్లాలోని మరికల్, ధన్వాడ మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో రంజాన్ పండుగ వేడుకలను ముస్లిం సోదరులు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరుపుకున్నారు. గత నెల రోజులుగా కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు, శనివారం ఉదయం ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. నమాజ్ అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మరికల్ ఈద్గా వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి, జిల్లా నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెన్నయ్య, ఉపసర్పంచ్ కటిక కాజా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు హరీష్ కుమార్, మండల అధ్యక్షులు వెలగొంది వీరన్న, యూత్ అధ్యక్షులు కాటేకొండ ఆంజనేయులు, మరియు నాయకులు రామకృష్ణారెడ్డి, నాగరాజు, లంబడి రాములు, బొంత మొగులయ్య తదితరులు పాల్గొన్నారు. అఖిలపక్ష నాయకులు కూడా ఈద్గాల వద్ద ముస్లిం సోదరులను కలిసి శుభాకాంక్షలు తెలిపి సోదరభావాన్ని చాటుకున్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

**మండల అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి**



**ప్రజానావ, చౌడేపల్లి:** రంజాన్ పండుగను పురస్కరించుకుని చౌడేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగభూషణ్ రెడ్డి ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలోని ఉపవాస దీక్షలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసి, సన్మార్గంలో నడవడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ పవిత్ర పండుగ అందరి జీవితాల్లో ఆనందం, శాంతి మరియు ఆరోగ్యాన్ని నింపాలని ఆయన ఆకాంక్షించారు.

# ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు

- **ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లింలు**



**ప్రజానావ, ఎండపల్లి:** పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా జరుపుకునే ఈద్-ఉల్-ఫితర్ పర్వదినాన్ని శుక్రవారం ఉమ్మడి వెల్గటూర్ మండలంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. గుల్లకోట, శాఖపూర్, జగదేవ్‌పేట్, అంబారీపేట, పాతగూడూర్ గ్రామాల్లోని ఈద్గాల వద్దకు తెల్లవారుజామునే ముస్లిం సోదరులు తరలివచ్చి ప్రత్యేక సామూహిక (నమాజ్) ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్‌లు పవిత్ర ఖురాన్ సందేశాలను వివరిస్తూ మానవత్వం, సహనం, దాతృత్వం, సోదరభావం వంటి విలువలను ఆచరించాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొనాలని, దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్థనలు చేశారు. నమాజ్ అనంతరం ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుంటూ "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా పలు చోట్ల పేదలకు 'జకాత్-ఉల్-ఫితర్' పేరుతో దానధర్మాలు నిర్వహించారు. చిన్నారులు, యువకులు కొత్త దుస్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామాల్లో పండుగ సందడి నెలకొని ప్రజలు ఆనందంగా వేడుకల్లో పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఈద్గాలను సందర్శించి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపి, రాష్ట్ర ప్రభుత్వం అందించిన తోఫాలను పంపిణీ చేశారు. కాగా ఈ వేడుకలు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచాయని, అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో కలిసి పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి మండల మాజీ కో-ఆప్షన్ సభ్యులు మహ్మద్ రియాజ్, మజీద్ సదర్లు ఫకీరోద్దీన్, రఫీక్, అనిఫ్, కజామియా, నసీరుద్దీన్, రషీద్, ఖాసీం, అబ్దుల్లా, అల్లీ సాబ్, మతపెద్దలు మహ్మద్ సలీం, హఫీజ్, తాజ్, నాసర్, ముస్తఫా, అఫ్జత్, నజీర్, బాబర్, సాధుల్లా, సాదిక్, సులేమాన్, షాహిద్, అజార్, షరీఫ్, ఇమామ్, మౌజన్లు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం..



- **పేద మైనార్టీలకు అండగా ప్రభుత్వం..**
- **రేంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన మంత్రి అడ్లూరి..**

**ప్రజానావ, ధర్మపురి:** రాహుల్ గాంధీని దేశ ప్రధాని చేయడానికి సెక్యులర్ పార్టీ ఆయన కాంగ్రెస్ పార్టీకి మైనార్టీలంతా అండగా నిలవాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. రంజాన్ సందర్భంగా జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో మసీదులు, ఈద్గాల వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. పేద మైనార్టీలకు ప్రభుత్వం ద్వారా అందించే రుణాలు ఇప్పించడానికి తనవంతుగా సహకరిస్తానని మంత్రి తెలిపారు. ముస్లిం యువతకు ఉపాధి కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. పేద ముస్లింలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు అర్హులకు రేషన్ కార్డులు అందజేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. మసీదులు ఈద్గాల వద్ద మౌలిక వసతుల కల్పనకు సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. మంత్రి వెంట ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు.

# రంజాన్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ



**ప్రజానావ, నారాయణపేట:** రంజాన్ పండుగను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లావ్యాప్తంగా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు. జిల్లాలోని ఈద్గాలు, మసీదులు మరియు ప్రార్థన మందిరాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బువ్వమ్మ గుట్ట ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను డీఎస్పీ ఎన్. లింగయ్య స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ.. భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని ఆదేశించారు. అనంతరం ప్రార్థనల కోసం విచ్చేసిన ముస్లిం సోదరులకు ఆయన రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ శాంతి, సామరస్య వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి వాకిటి శ్రీహరి




**ప్రజానావ, నారాయణపేట:** రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర క్రీడా, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం మక్తల్ నియోజకవర్గంలోని ఆత్మకూరు ఈద్గా వద్ద జరిగిన రంజాన్ వేడుకల్లో మంత్రి స్వయంగా పాల్గొన్నారు. ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు పూర్తి చేసిన అనంతరం, మంత్రి వారిని ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి ప్రతీక అని కొనియాడారు. సమాజంలో సోదరభావం పెంపొందేలా ఇలాంటి పండుగలు తోడ్పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు మరియు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యలపై సీఎం స్పందించాలి

**సీఐటీయూ డిమాండ్**

**ప్రజానావ, గజ్వేల్:** సిద్దిపేట జిల్లా నర్మేట రైతు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముందుగా మల్లన్న సాగర్ నిర్వాసిత రైతుల సమస్యలపై స్పష్టతనివ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో నిర్వాసితుల పక్షాన నిరాహార దీక్ష చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అధికారంలో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రాజెక్టు నిర్వాసితులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో నష్టపరిహారం, పునరావాస సౌకర్యాలు అందలేదని ఆరోపించారు. గజ్వేల్ పరిధిలోని నిర్వాసిత కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, వైద్యం వంటి కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు ఎటువంటి షరతులు లేకుండా రైతు బీమా, రైతు భరోసా తరహాలో దీర్ఘకాలిక సహాయ పథకాలను ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్వాసితులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఐక్యంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నిర్వాసిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాజనాలబండపై సత్యప్రమాణాల జోరు



**ప్రజానావ, చౌడేపల్లి :** సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండపై శనివారం భక్తుల సందడి నెలకొంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను

### • చోరీకి గురైన బంగారం ప్రత్యక్షం

దర్శించుకున్నారు. ఈ క్రమంలో చిత్తూరుకు చెందిన ఒక దంపతుల ఇంట్లో 13 గ్రాముల బంగారం చోరీకి గురవ్వగా, వారు రాజనాలబండపై ప్రమాణం చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే, వారు ఆలయానికి చేరుకోకముందే గుర్తుతెలియని వ్యక్తులు ఆ బంగారాన్ని వారి ఇంటి కాంపౌండ్‌లో పడేశారు.

దీంతో బాధితులు ఆ బంగారాన్ని స్వామివారి చెంత ఉంచి పూజలు నిర్వహించి, తమ సొత్తును తిరిగి పొందినట్లు తెలిపారు. మరోవైపు, ఆలయ అభివృద్ధికి ఆటంకంగా ఉన్న పాపులమ్మ సమాధిని తొలగించేందుకు ఆమె వారసులు అంగీకరించారు. టీటీడీ అధికారులు సమాధిని తొలగించిన వెంటనే ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యం

### • తూంకుంట నర్సారెడ్డి

**ప్రజానావ, గజ్వేల్ :** గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు పార్టీలో సముచిత ప్రాధాన్యం ఉంటుందని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి హామీ ఇచ్చారు. శనివారం ప్రజ్ఞాపూర్‌లో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు లభించినప్పటికీ, స్వల్ప తేడాతో అధికారాన్ని కోల్పోయామని తెలిపారు. ఓడిన అభ్యర్థులకు పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో తగిన అవకాశాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని, రానున్న రోజుల్లో పార్టీ మరింత బలపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాయకుల అవినీతిపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, కొల్లూరి



సత్యం మరియు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాంతి సామరస్యాలకు ప్రతీక రంజాన్





**ప్రజానావ, కోరుట్ల:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం కోరుట్లలోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన భద్రతా బందోబస్తును ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..

### • జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

రంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనమని, అందరూ శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కోరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు, కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ అధికారిక పర్యటన



**ప్రజానావ,చౌడేపల్లి:** చౌడేపల్లి మండల కేంద్రంలో వాసవి క్లబ్ (ఎ21గా) జిల్లా గవర్నర్ బొగరపు వెంకట సురేష్ అధికారిక పర్యటన శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చౌడేపల్లిలోని వాసవి క్లబ్ మరియు వాసవి వనిత క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది క్లబ్ ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలను సమీక్షించడంతో పాటు, భవిష్యత్తులో చేపట్టాల్సిన సేవలపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 29 (ఆదివారం) ఒంగోలులో నిర్వహించనున్న 'వాల్ట్' (వాసవి లీడర్షిప్ ట్రైనింగ్) ప్రోగ్రామ్‌కు సభ్యులందరూ హాజరుకావాలని, ఆసక్తి గలవారు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు నరేంద్ర, నాగేంద్ర, కోశాధికారి అరవింద్, జోన్ చైర్మన్ ఉష, రీజన్ చైర్మన్ కృష్ణమూర్తి, రీజన్ కార్యదర్శి గోవర్ధన్ పాల్గొన్నారు. అలాగే వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ కోశాధికారి ఇస్సా నాగలక్ష్మి, గౌరవాధ్యక్షులు రామ్ కుమార్, వాసవి క్లబ్ మరియు వనిత క్లబ్ అధ్యక్షులు శ్రీనాథ్, రంగవల్లి, కార్యదర్శి నాగలక్ష్మి, కోశాధికారి అమర్నాథ్ మరియు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆపదలో అండగా నిలిచిన చిన్ననాటి స్నేహితులు



**ప్రజానావ, నల్లబెల్లి :** చిన్ననాటి స్నేహితురాలు అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆమె కుటుంబానికి తోటి మిత్రులు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. నల్లబెల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-03 బ్యాచ్‌లో చదువుకున్న శంషాబాద్ గ్రామానికి చెందిన కొలిపాక విజయ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె పూర్వ స్నేహితులు శనివారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తమ వంతు సహాయంగా రూ.30 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేసి, భవిష్యత్తులోనూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముత్యాల రాజేందర్, రామిని నాగరాజు, పెరుమాండ్ల శ్రీనివాస్, ఎస్. అశోక్, పులిగుజ్జుల రాజు, మామిడి రాజు, పప్పు రేణు, తండా సంపత్, బి. సుమలత, పి. సుమలత తదితరులు పాల్గొన్నారు. తమ స్నేహితురాలిపై ఉన్న మమకారంతో మిత్రులు చేసిన ఈ సాయాన్ని గ్రామస్థులు అభినందించారు.

# రైతుల క్షేత్ర ప్రదర్శన



**ప్రజానావ, నల్లబెల్లి:** ఫామ్ ఆయిల్ సాగుకు రైతులకు అవగాహన కల్పించేందుకు ఆయిల్ ఫామ్ సాగుపై క్షేత్ర ప్రదర్శనకు మండల రైతులను సిద్దిపేట జిల్లా నర్మేట గ్రామంలోని ఆయిల్ ఫామ్ సాగు తో పాటు పామాయిల్ గింజల నుండి ఇంధనాన్ని తీసే కర్మాగారాన్ని సైతం సందర్శించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖ ద్వారా చేపట్టింది. నర్మేట గ్రామంలోని పామాయిల్ పంట సాగుపై రైతులకు ఆర్థిక స్వాలంబన తోపాటు సాగు శ్రమ తగ్గింపు పై అవగాహన కల్పించారు.నల్లబెల్లి మండలం నుండి నల్లబెల్లి మండల కేంద్రం, కొండాయలపల్లి,శనిగరం, ముచింపుల రేలకుంట నందిగామ మేడపల్లి రామతీర్థంగ్రామాల రైతులు సుమారు 250 మంది ఈ క్షేత్ర ప్రదర్శనకు శనివారం బయలుదేరారు.వీరి వెంట వ్యవసాయ విస్తరణ అధికారి మహేందర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇన్చార్జి సీఈవో ఎల్లన్న తదితరులు ఉన్నారు..

# చంద్రయ్యకు మాతృవియోగం

### నివాళులర్పించిన సీపీఎం నాయకులు



**ప్రజానావ, పాములపాడు :** పాములపాడు మండలం భానుముక్కల గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు చంద్రయ్యకు మాతృవియోగం కలిగింది. గత పదేళ్లుగా ప్రజాశక్తి విలేకరిగా పనిచేసి, ప్రస్తుతం 'వార్త' రిపోర్టర్‌గా కొనసాగుతున్న చంద్రయ్య తల్లి మరియమ్మ (86) శుక్రవారం మధ్యాహ్నం అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం మండల కార్యదర్శి డి. స్వామన్న, సీఐటీయూ జిల్లా నాయకులు మేకల రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఏసేపు ఆమె పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మరియమ్మ ఎంతో శాంత స్వభావురాలని, అందరితో ఆప్యాయంగా ఉండేవారని కొనియాడారు. అనంతరం చంద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మరియమ్మకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని వారు ఆకాంక్షించారు.

# బొమ్మెనలో 300 ఈత చెట్ల నరికివేత

- గీతా కార్మికుల ఆందోళన



**ప్రజానావ, కథలాపూర్ :** కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామంలో గీతా కార్మికుల జీవనాధారమైన సుమారు 300 ఈత చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఒకేసారి భారీ సంఖ్యలో చెట్లను ధ్వంసం చేయడంతో గౌడ్ కుటుంబాలు తమ ఉపాధిని కోల్పోయి రోడ్డున పడ్డాయి. గత ఏడాది కూడా ఇలాంటి ఘటన జరిగినప్పుడు పోలీసులు హెచ్చరించినప్పటికీ, ఈసారి మరింత తెగింపుతో చెట్లను నరికివేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ మంచితనాన్ని బలహీనతగా తీసుకుని కులవృత్తిపై దాడికి పాల్పడ్డారని గీతా కార్మిక సంఘం ప్రతినిధులు మండిపడ్డారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ మరియు పోలీస్ శాఖలు స్పందించి, బాధ్యులపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకుడు యాగండ్ల రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. గౌడ్ సమాజం ఐక్యంగా ఉండి తమ హక్కులను, వృత్తిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

# ఉపాధి శ్రామికులకు రంజాన్ తోఫా





- మిఠాయిలు పంపిణీ చేసిన సేవా భారతి

**ప్రజానావ,పాములపాడు :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సేవా భారతి (వైఆర్డీఎస్) అధ్యక్షులు ఎస్. షర్ఫుద్దీన్ అలీ ఆధ్వర్యంలో శనివారం ఉపాధి హామీ శ్రామికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని కుంటలో పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి, వారికి ఈద్ ముబారక్ తెలుపుతూ స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాజ సేవకుడు కలబండి నాగరాజు, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు కలబండి అంకన్న మరియు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్ఫుద్దీన్ అలీ మాట్లాడుతూ.. రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఉపవాస దీక్షల ద్వారా పేదల ఆకలి కష్టాలను తెలుసుకోవడమే ఇస్లాం ముఖ్య సందేశమని వివరించారు. ఈ పవిత్ర పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, శాంతి మరియు సోదరభావాన్ని నింపాలని ఆయన ఆకాంక్షించారు. సర్వమత సామరస్యానికి ప్రతీకగా అందరూ కలిసిమెలిసి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ప్రతినిధులు దక్కా శ్రీకాంత్, గోవిందు, జి. సాయి కృష్ణ, కె. మోషే మరియు ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

# కథలాపూర్‌లో ఇసుక మాఫియా అక్రమ దందా




- అధికారుల కనుసైగల్లోనే రవాణా

**ప్రజానావ, కథలాపూర్:** కథలాపూర్ మండలంలో అక్రమ ఇసుక రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. బొమ్మెన, తక్కలపల్లి, సిరికొండ, తాండ్రియాల, గంభీర్‌పూర్ గ్రామాల పరిసరాల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పగలు ట్రాక్టర్లతో రహస్య ప్రదేశాల్లో ఇసుకను నిల్వ చేసి, రాత్రి వేళల్లో లారీలు, టిప్పర్ల ద్వారా జగిత్యాల, ఆర్మూర్, నిజామాబాద్ వంటి ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ వ్యవహారం అంతా మండల స్థాయి అధికారుల సహకారంతోనే జరుగుతోందని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ముఖ్యంగా రెవెన్యూ అధికారుల కనుసైగల్లోనే వసూళ్ల పర్వం సాగుతోందని, పట్టుబడిన వాహనాల నుండి భారీగా నగదు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బొమ్మెనలో రిపేరుకు ఆగిన లారీ నుండి రూ. 50 వేలు వసూలు చేసిన ఘటన ఇందుకు నిదర్శనమని బాధితులు వాపోతున్నారు.

అక్రమ రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటి సాగు, తాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఈ ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



**ప్రజానావ, వికారాబాద్:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం వికారాబాద్ పట్టణం ఆలంపల్లి దర్గా వద్ద జరిగిన సామూహిక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు అందజేశారు. అనంతరం వికారాబాద్ మండలం పుల్మద్ది గ్రామంలోని మండల బీఆర్ఎస్ మైనారిటీ విభాగం అధ్యక్షులు గయాజ్ నివాసానికి వెళ్లారు. అక్కడ గ్రామంలో నూతనంగా గెలిచిన బీఆర్ఎస్ పార్టీ వార్డు సభ్యులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

### కరపత్రాల ఆవిష్కరణ



**ప్రజానావ, మెట్‌పల్లి:** ఈనెల 24వ తేదీన మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను శనివారం ముత్యంపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లాపూర్ లైన్స్ క్లబ్ చైర్మన్ రేవెల్లి తిరుపతి మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తగిన చికిత్సలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు సామల విష్ణు, దారవేణి జీవన్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ దామ రాజేష్, ముత్యంపేట మాజీ సర్పంచులు వర్తినేని ప్రభాకర్ రావు, మారు ఆనంద రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొల్లపల్లి రామా గౌడ్ పాల్గొన్నారు. అలాగే నడకూడ మాజీ సర్పంచ్ ముద్దం రాజేందర్ రెడ్డి, తెడ్డు లక్ష్మారెడ్డి, పడిగెల మురళీధర్ మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యం పట్టివేత

### ఒకరిపై కేసు నమోదు



**ప్రజానావ, గన్నేరువరం:** గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్ సమీపంలో శనివారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న 32 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. బొలేరో వాహనంలో బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు ప్రత్యేక దాడులు నిర్వహించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సివిల్ సప్లై అధికారి సురేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాసింపేట గ్రామానికి చెందిన బొజ్జ రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి. నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పేదలకు అందాల్సిన పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## మరికల్ సమీపంలో కారు-బైక్ ఢీ

### చికిత్స పొందుతూ బాలుడు మృతి



**ప్రజానావ, నారాయణపేట:** మరికల్ మండల కేంద్రంలోని కన్మనూరు రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మరికల్ ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. మరికల్ గ్రామానికి చెందిన రిషి కుమార్ (14), సాయి కుమార్ ఇద్దరూ మోటార్ సైకిల్‌పై కన్మనూరు వెళ్లే రహదారి చౌరస్తాలో వెళ్తుండగా, చిత్తనూరు కంపెనీకి చెందిన కారు వీరిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో వెంటనే 108 వాహనంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రిషి కుమార్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సాయి కుమార్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాములు తెలిపారు.

## తుక్కాపూర్‌లో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

**ప్రజానావ, తొగుట:** తొగుట మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో శనివారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఉపాధి హామీ నిధుల నుండి మంజూరైన రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అనంతరం గ్రామంలోని చిక్కుడు ఉపలయ్య నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ మహోత్సవంలో పాల్గొని, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిక్కుడు మస్టి కళావతి స్వామి, ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), సర్పంచ్ పాగాల శోభా కొండల్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు గొడుగు మురళి, రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బరెంక్కల స్వామి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉల్లెంగుల సాయి ముదిరాజ్ మరియు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# పిల్లి మాణిక్యరావును కలిసిన లింగాల నాగరాజు



**ప్రజానావ, గుంటూరు :** ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావును శనివారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో నంద్యాల జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు మరియు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లింగాల నాగరాజుతో పాటు ఎమ్మార్పీఎస్ సీనియర్ జిల్లా నాయకులు మిట్టకందాల రామకృష్ణ కూడా పాల్గొన్నారు. చైర్మన్‌తో పలు సామాజిక అంశాలపై వారు చర్చించినట్లు సమాచారం.

# రంజాన్ మతసామరస్యానికి ప్రతీక

ఆత్రం సుగుణ



**ప్రజానావ, ఆసిఫాబాద్:** రంజాన్ పర్వదినం కులమతాలకు అతీతంగా మానవతా విలువలను, మతసామరస్యాన్ని చాటిచెబుతుందని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సుల్తాంగూడలో కాంగ్రెస్ యువ నాయకుడు మహమ్మద్ సుజాహిత్ ఖాన్ నివాసంలో ఏర్పాటు చేసిన రంజాన్ విందుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సోదరభావం, పరస్పర గౌరవం వంటి విలువలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు ఐక్యతతో మెలిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాగ్మారె శ్రీకాంత్, మాజీ సర్పంచ్ సిడాం జగన్నాథ్ రావు, జలపతి రావు, మాజీ ఎంపీటీసీ గోగర్ల రాజయ్య మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎడ్ల బండి పోటీలు



**ప్రజానావ, జగిత్యాల:** గొల్లపల్లి మండలం చిల్వకోడూరు గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బండి పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి సాధించిన తాళ్లగట్టు అంజన్న స్వామికి చిల్వకోడూరు సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు దాసరి తిరుపతి గౌడ్ రూ. 21,016/- నగదు అందజేశారు. రెండవ బహుమతి సాధించిన మాదాసు వెంకట శివకు ఉప సర్పంచ్ దీటి మహేష్ రూ. 10,016/- నగదును, మూడవ బహుమతి సాధించిన విజేతకు వార్డు సభ్యులు రేవల్ల రాజయ్య గౌడ్-గంగవ్వ రూ. 5,016/- నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ మరియు వివిధ గ్రామాల సర్పంచ్‌లు మ్యాక స్వామి, రామ్ రెడ్డి, రాజేశ్వరరావు, జెల్లా అఖిల-అనిల్, గంగచారి, కాసం రాజశేఖర్, రాజం పోచమ్మ తిరుపతి పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు ఓరగంటి లచ్చయ్య, గంధం నర్సయ్య, కంపెల్లి శ్రీకాంత్, తోట్ల సురేష్, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రకృతి పరిరక్షణే ధ్యేయం

## శ్రీశైలంలో పీసీసీఎఫ్ విజయ్ కుమార్ ప్రత్యేక పూజలు




**ప్రజానావ, శ్రీశైలం :** పర్యావరణ పరిరక్షణ మరియు అటవీ సంపద రక్షణే ధ్యేయంగా అటవీశాఖ పీసీసీఎఫ్ (ఫీల్డ్ డైరెక్టర్) బి. విజయ్ కుమార్ ఐఎఫ్ఎస్ శనివారం శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్న ఆయన, క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం - నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్ (పెద్ద పులి సంరక్షణ కేంద్రం) సురక్షితంగా ఉండాలని, కార్చిచ్చులు మరియు అక్రమ వేట నుండి అడవిని కాపాడాలని భగవంతుని ప్రార్థించినట్లు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో సేవలందిస్తున్న సిబ్బందికి ప్రకృతిని కాపాడే శక్తిని ప్రసాదించాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని, అడవులను కాపాడుతూ భవిష్యత్ తరాలకు అందించాలని ఆయన సూచించారు.

# పాఠ్యాంశంగా భారత రాజ్యాంగం

- వికారాబాద్‌లో జై భీమ్ మహాసేన మహారథయాత్ర



**ప్రజానావ, వికారాబాద్ :** భారత రాజ్యాంగాన్ని 6వ తరగతి నుండి పైచదువుల వరకు పాఠ్యపుస్తకాల్లో ప్రత్యేక సబ్జెక్టుగా చేర్చాలనే డిమాండ్‌తో జై భీమ్ మహాసేన చేపట్టిన 'మహారథయాత్ర' శనివారం సాయంత్రం వికారాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. జాతీయ అధ్యక్షుడు రాజ్యాంగం అంజన్న నేతృత్వంలో గత 23 రోజులుగా వివిధ జిల్లాల్లో పర్యటిస్తున్న ఈ యాత్రకు మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. ఆనంద్ మాదిగ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగం పట్ల ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని, ఇందుకోసం కోటి సంతకాల సేకరణ చేపడుతున్నామని తెలిపారు. వికారాబాద్ చేరుకున్న యాత్ర బృందం బాబు జగ్జీవన్ రామ్ మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ యాత్ర ఇబ్రహీంపట్నం దిశగా సాగింది. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రవీందర్, అశోక్, గట్టు ఎర్ర అలెగ్జాండర్ ప్రభు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తితో మహిళల ఆర్థికాభివృద్ధి






- మంత్రి గడ్డం వివేకానంద

**ప్రజానావ, మంచిర్యాల:** రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి' పథకం ద్వారా కృషి చేస్తోందని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. శనివారం చెన్నూర్ మండల కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఆయన 360 మంది మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒక్కో మిషన్‌ను రూ. 12 వేల వ్యయంతో అందిస్తున్నామని, వీరికి తగిన శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇందిరా క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు మరియు ఇతర వ్యాపారాల్లో భాగస్వామ్యం కల్పిస్తున్నామని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా అమృత్ పథకం కింద చెన్నూర్, మందమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో రూ. 100 కోట్లతో పైపులైన్ పనులు, నీటి ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నామని, దీనివల్ల రాబోయే 15 ఏళ్ల వరకు నీటి సమస్య ఉండదని హామీ ఇచ్చారు. ప్రభుత్వ లక్ష్యం మహిళా సాధికారత: జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చెన్నూర్ పట్టణంలో మూడు కొత్త నీటి ట్యాంకులను నిర్మిస్తున్నామని, చెరువుల సుందరీకరణ ద్వారా భూగర్భ జలాలను పెంచుతున్నామని పేర్కొన్నారు. అనంతరం మంత్రి, కలెక్టర్ కలిసి 100 పడకల ఆసుపత్రి మరియు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ముందుగా మందమర్రి ఈద్గాలో ముస్లింలతో కలిసి మంత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మందమర్రిలో రూ. 50 లక్షలతో షాదీఖానా, ఈద్గా ప్రహరీ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మహిళా సర్పంచ్‌కు అవమానం




- కాంగ్రెస్ నాయకులపై చర్యలకు డిమాండ్

**ప్రజానావ, నారాయణపేట:** మరికల్ మండల పరిధిలోని కన్మనూరు గ్రామంలో శనివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా గ్రామ సర్పంచ్ అంకిత సురేందర్ గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు అవమానించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. సర్పంచ్ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసే సమయంలో నర్వ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నయ్య సాగర్ మరియు ఇతర నాయకులు ఆమె చేతిలోని కత్తెరను లాక్కుని, పక్కకు వెళ్లాలని దురుసుగా ప్రవర్తించినట్లు బాధితురాలు తెలిపారు. గతంలో కూడా ఇలాగే ప్రోటోకాల్ పాటించకుండా తనను కాదని కాంగ్రెస్ నాయకులే ఇళ్లను ప్రారంభించారని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. "డబ్బులు మేము ఇస్తున్నాం.. మేమే ప్రారంభిస్తాం, మీకు సంబంధం లేదు" అంటూ ఒక మహిళా సర్పంచ్‌ను కించపరిచేలా మాట్లాడటం సరికాదని ఆమె పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉన్న సర్పంచ్‌ను అవమానించిన సదరు నాయకులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులను ఆమె కోరారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**ప్రజానావ, తొగుట:** తొగుట మండల కేంద్రంలో పొద్దుతిరుగుడు, మక్కజొన్న కొనుగోలు కేంద్రాలను దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులు మధ్యవర్తుల చేతుల్లో మోసపోకుండా నేరుగా ప్రభుత్వ కేంద్రాల్లోనే పంటను విక్రయించుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు సకాలంలో చెల్లింపులు జరుగుతాయని, హమాలీ సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, సర్పంచ్ పాగాల శోభా కొండల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, సీఈఓ గంగారెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



